# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 25-09-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రంలోని వరద బాధితులకు, పంట నష్టపోయిన రైతులకు 602 కోట్ల రూపాయల పరిహారం అందించామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలియజేశారు.
- ❖ విశాఖలో ఇంటర్నేషనల్ డేటా సెంటర్ ను అభివృద్ధి చేయబోతున్నామని రాష్ట్ర ఐటి శాఖా మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.
- ❖ శ్రీకాకుళంలోని మూలపేట పోర్ట్ ను సంవత్సరంలోగా పూర్తి చేసి మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని కేంద్రమంత్రి కె.రామ్మోహన్ నాయుడు అన్నారు.
- ❖ విశాఖపట్నం భీమిలి సమీపంలో ఎర్రమట్టి దిబ్బల వద్ద జరుగుతున్న పనులను నిలిపివేయాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశించింది.
- ❖ ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని సీతంపేట ఐటిడిఎ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి. యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు.

===========================

రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన ప్రజలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించింది. వరద బాధితులకు, పంట నష్ట పోయిన రైతులకు 602 కోట్ల రూపాయల పరిహారం ఇచ్చామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు వరద బాధితులకు ఆర్థిక సహాయం అందించిన సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ... రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలకు 47 మంది చని పోయారని, ఒక్కో మృతుని కుటుంబానికి 5 లక్షల రూపాయల చొప్పున పరిహారం అందజేశామని వెల్లడించారు. భారీ వర్షాలకు 1562 పశువులు చనిపోయాయని పేర్కొన్నారు. పశు సంపదకు పరిహారం కింద 6.83 కోట్లు రూపాయలు ఇచ్చామని, దెబ్బతిన్న 44 వేల 402 ద్విచక్ర వాహనాలకు 3 వేల రూపాయల చొప్పున 13.32 కోట్ల రూపాయల పరిహారం అందించామని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షా 18 వేల 70 ఇళ్లు మునిగిపోగా, 215 కోట్ల రూపాయలు పరిహారం ఇచ్చామని ముఖ్యమంత్రి వెల్లడిస్తూ.....

(వాయిస్ 34 సెకన్లు)

==========================

మత్స్యకారుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఈరోజు శ్రీకాకుళం రూరల్ మండలం కుందువానిపేట గ్రామంలో నిర్వహించిన "ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, స్థానిక శాసన సభ్యులు గొండు శంకర్ లతో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ... మత్స్యకారులకు ఉపాధి లేక వలసలు వెళ్ళిపోతున్నారని, మూలపేట పోర్ట్ ను సంవత్సరంలోగా పూర్తి చేసి ఈ ప్రాంతంలోని మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. భోగాపురం విమానాశ్రయం పూర్తి చేస్తే ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. ఇచ్చిన మాటకు ప్రభుత్వం కట్టుబడి 1వ తేదీన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి 4 వేల రూపాయల పింఛన్ అందిస్తున్నామని అన్నారు.

==========================

విశాఖపట్టణంలో ఇంటర్నేషనల్ డేటా సెంటర్ ను అభివృద్ధి చేయబోతున్నామని రాష్ట్ర ఐటి శాఖా మంత్రి నారా లోకేష్ తెలిపారు. విశాఖలో ఈరోజు నిర్వహించిన సీఐఐ ఇన్ఫ్రాస్ట్రక్చర్ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ... రాష్ట్రంలో అభివృద్ధి వికేంద్రీకరణకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ఇందులో భాగంగా ప్రతిజిల్లాలో ఒక్కో రంగంపై దృష్టి సారించామన్నారు. కర్నూలు జిల్లాలో పునరుత్పాదక శక్తి రంగాన్ని అభివృద్ధి చేసి రానున్న 5 సంవత్సరాల్లో 72 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఉత్తరాంధ్రను ఫార్మా హబ్‌గా తీర్చిదిద్దుతామని, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభమయ్యాక విశాఖపట్నంతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాలు విప్లవాత్మకమైన అభివృద్ధి సాధిస్తాయని మంత్రి పేర్కొంటూ ...

(వాయిస్ 34 సెకన్లు)

విరామం

==========================

రానున్న రబీ సీజన్ లోగా రైతుల సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో రైతు సమస్యలను తెలుసుకుని పరిష్కరించే ఉద్దేశంతో నీటిపారుదల, వ్యవసాయం, రోడ్లు భవనాలు, గ్రామీణ నీటి సరఫరా విభాగాల జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు, రైతులతో ఈరోజు ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. రామచంద్రాపురం నియోజకవర్గంలోని పంట కాలువలు గుర్రపుడెక్కతో నిండిపోయి ఉన్నాయని, రహదారులన్నీ దెబ్బ తిన్నాయని, నీటిపారుదల వ్యవస్థ సరిగాలేదని, కొన్ని ప్రాంతాల్లో మంచినీటి కొరత కూడా ఉందని రైతులు తమ సమస్యలను అధికారులకు మంత్రి సమక్షంలో తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... గత ప్రభుత్వ హయాంలో రైతు సమస్యలపై దృష్టి సారించకపోవడంతో సమస్యలు అధికమై రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని... వారి సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

==========================

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని సీతంపేట ఐటిడిఏ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించబోతున్నామని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి సి. యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేస్తూ ఈనెల 27వ తేదీన ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా అడలి వ్యూ పాయింట్ ను ప్రారంభిస్తామని తెలిపారు. 27వ తేదీ ఉదయం 8 గంటలకు అడలి వ్యూ పాయింట్ లోని రెస్టారెంట్, నైట్ క్యాంపింగ్ టెంట్లు ప్రారంభిస్తామని వెల్లడించారు. వ్యూ పాయింట్ వద్ద పర్యాటకుల కోసం ఫుడ్ ఫెస్టివల్ తో పాటు వివిధ స్టాల్స్ కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలియజేశారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్ లో "ఐ లవ్ సీతంపేట" పేరుతో ఏర్పాటు చేసిన ఫోటో పాయింట్ ను ప్రారంభించనున్నామని, అదే విధంగా 5D థియేటర్ ను పునః ప్రారంభిస్తామని ఆయన తెలియజేశారు.

==========================

విశాఖ జిల్లాలోని భీమిలి సమీపంలో ఎర్రమట్టి దిబ్బల వద్ద జరుగుతున్న పనులను నిలిపివేయాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశించింది. ఎర్ర మట్టిదిబ్బల ప్రాంతంలో  తవ్వకాలపై ఇటీవల ఉన్నత న్యాయస్థానంలో వ్యాజ్యం దాఖలైంది. దిబ్బలు తవ్వుతున్న ప్రదేశం వారసత్వ సంపద పరిధిలోకి వస్తుందని అనుమతులు లేకుండా పనులు జరుగుతున్నాయని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. ఈ క్రమంలో పనులు నిలిపి వేయాలని ఆదేశిస్తూ.. జీవీఎంసీ, ఇతర సంబంధిత శాఖలకు హైకోర్టు నోటీసులు ఇచ్చింది.

=============================

ఉత్తరాంధ్ర-దక్షిణ ఒడిశా తీరాల్లో పశ్చిమ మధ్య, దానిని ఆనుకుని ఉన్న వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ మరో అల్పపీడనంగా మారిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి,  పార్వతీపురం మన్యం, అల్లూరి, కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

=============================

స్వర్ణాంధ్ర 2047 రూపకల్పనకు ప్రజలు తమ సలహాలు సూచనలను తెలియజేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ అధికారులకు తెలిపారు. ఈరోజు జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులతో శాఖల వారీగా “విజన్ డాక్యుమెంట్”కు సంబంధించి ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ కార్యక్రమంలో భాగంగా గ్రామసభలు నిర్వహించాలను ప్రతి గ్రామ సభలో ప్రభుత్వం రూపొందించిన విజన్ డాక్యుమెంట్ ను చదివి వినిపించాలని అన్నారు.  ప్రజల నుండి అభిప్రాయాలని స్వీకరించాలని, తీసుకున్న సమాచారంతో రాబోయే 5 సంవత్సరాలకు మండల స్థాయి కార్యాచరణ ప్రణాళికను తయారు చేసి ఈనెల 30వ తేదీలోగా అందజేయాలని కలెక్టర్ తెలిపారు.

=============================

పార్వతీపురం మన్యం జిల్లాలో వివిధ కేటగిరీలకు చెందిన విభిన్న ప్రతిభావంతులు ఉచిత ఉపకరణాలకు ఆన్ లైన్ లో దరఖాస్తులు సమర్పించాలని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు కె. కవిత కోరారు. ల్యాప్ టాప్స్, టచ్ ఫోన్స్, మూడు చక్రాల సైకిళ్ళు, వీల్ చైర్లు, చంక కర్రలు, అంధుల చేతి కర్రలు, తదితర ఉపకరణాలు ఉచితంగా కావలసినవారు ఆన్ లైన్ లో దరఖాస్తు చేయాలని తెలియజేశారు.

=============================
=============================